



జలమయమైన చింతలపట్టెడ దళితవాడ

విజయపురం మండలం ఇళ్లత్తూరులో పొలాల్లో చేరిన నీరు





మునిగిపోయిన పంట పొలాలు

కుండపోత

నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో భారీ వర్షం

- 142.6 మి.మీ వర్షపాతం నమోదు
- జలమయమైన కాలనీలు, పంట పొలాలు
- కన్నికాపురం మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు
- వరద నీటితో రాకపోకలకు అంతరాయం
- చెరువుల్లో సగానికి పైగా చేరిన నీరు



నింద్ర మండలం జీఎన్ కండ్రిగ వద్ద కలుజు పారడంతో నిలిచిపోయిన వాహన రాకపోకలు



కన్నికాపురం మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు

నగరి/విజయపురం/నింద్ర, ఆగస్టు 12 : నగరి, విజయపురం మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి తర్వాత భారీ వర్షం కురిసింది. 12 గంటల తర్వాత మొదలైన వాన తెల్లవారుజాము 4 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. కాలనీలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. చింతలపట్టెడ దళితవాడ జలమయమైంది. కన్నికాపురం గ్రామంలో పంట పొలాలు నీట మునిగాయి. పాఠశాల ఆవరణ పూర్తిగా జలమయం కావడంతో సెలవు ప్రకటించారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడ దళితవాడలో 69 ఇళ్లు నీటమునిగాయని తహసీల్దారు రవికుమార్ తెలిపారు. నాగరాజకుప్పం పంచాయతీ కన్నికాపురం చెరువు నుంచి ఓజికుప్పం చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ పూడిపోవడంతో గట్టు తెగి కన్నికాపురం గ్రామం మీదుగా వరద నీరు వచ్చాయి. కల్వర్టు తెగిపోవడంతో గ్రామం జలమయమైంది. రాకపోకలు స్తంభించాయి. గ్రామం నుంచి బయటవెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు, కూలీలు ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. పంట పొలాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. చెరువుల్లో సగానికి పైగా నీరు చేరింది. విజయపురం మండలంలో గుంటలు, కాలువలు పూర్తిగా నిండిపోయాయి. నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరి పైరు నేలకొరిగింది. ఇళ్లత్తూరు వద్ద వరవ కాలువలు ఆక్రమణకు గురికావడంతో ఇళ్లత్తూరు - ఎన్ఎన్ కండ్రిగ రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నింద్ర మండలంలో లోతట్టు కాలనీల్లోకి నీరు చేరింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాల్లో నీరు చేరింది. పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.



వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

వరద బాధిత ప్రాంతాలను ఎమ్మెల్యే భానుప్రకాష్ పరిశీలించారు. చింతలపట్టెడ దళితవాడలో జలమయమైన ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. కన్నికాపురం గ్రామాన్ని సందర్శించి, తెగిపోయిన కల్వర్టును, నీట మునిగిన పంటలను పరిశీలించారు. జలమయమైన కేజీకుప్పం ఆది ఆంధ్రవాడను సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసర సరుకులు అందించాలని రెవెన్యూ అధికారులను కోరారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆరోగ్యపరమైన చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

నాలుగు మండలాలు మినహా..

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు నాలుగు మండలాలు మినహా జిల్లా అంతటా బలమైన వర్షం కురిసింది. నగరిలో రికార్డు స్థాయిలో 142.6మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా శాంతిపురంలో 3.4 మి.మీ నమోదైంది. గుడిపాలలో 79.2, విజయపురం 77.6, నింద్ర 60.4, చిత్తూరు రూరల్ 56.0, బంగారుపాళ్యం 55.2, పాలసముద్రం 44.2, తవణంపల్లి 40.2, గంగాధరనెల్లూరు 36.0, గంగవరం 35.8, పలమనేరు 29.2, రామకుప్పం 28.6, యాదమరి 26.8, వి.కోట 24.0, బైరెడ్డిపల్లి 23.6, ఐరాల 22.2, పుంగనూరు 22.2, చిత్తూరు 21.4, శ్రీరంగరాజపురం 14.2, పెద్దపంజాణి 12.2, పూతలపట్టు 11.0, కుప్పం 10.2, గుడుపల్లి 8.4, చౌడేపల్లి 7.2, కార్వేటినగరం 6.8, పెనుమూరు 6.2, వెదురుకుప్పంలో 4.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

దేశభక్తి పెంపొందించేలా

హర్ ఘర్ తిరంగా



హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: ప్రతి భారతీయుడి మదిలో దేశభక్తి పెంపొందించేలా జిల్లాలో నాలుగురోజుల పాటు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో ఆయన జాతీయ జెండాను చేతబట్టి జిల్లా అధికారులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడడం మనందరి బాధ్యత అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి గురువారం వరకు జిల్లా అంతటా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలిపివేత

ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకం



రామభద్రాపురం సచివాలయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సచివాలయాల ద్వారా చేపట్టిన డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేసింది. జిల్లాలో 504 గ్రామ, 108 వార్డు సచివాలయాలున్నాయి. వీటిలో 69 సచివాలయాల్లో 2022, జనవరి 18న ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో భూరీసర్వే ప్రక్రియ ముగిశాక సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరపాలని నిర్ణయించారు. ఇందుకోసం సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. అయితే ఎక్కడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సవ్యంగా జరగలేదు. భూముల వివరాలన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండడంతో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అరకొరగా సాగింది. జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు సర్వర్ మొరాయిస్తూ ఉండడంతో తరచూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిలిచిపోతోంది. అయినా గత ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లి అభాసుపాలైంది.

ఆసక్తి చూపని జనం

ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడికక్కడ భూకబ్జాలు, ఆక్రమణలు జరిగాయి. పైగా సచివాలయాలు వైసీపీ నేతలకు కేంద్రాలుగా మారాయి. ఈ సందర్భంగా సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే ప్రజల్లో భయం నెలకొంది. దీంతో రిజిస్ట్రేషన్లపై పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం అంతంత మాత్రమే

గడచిన రెండున్నరేళ్లలో రిజిస్ట్రేషన్ల సంఖ్య 110 దాటలేదు. 110 రిజిస్ట్రేషన్లు జరపడంతో రూ.10.88 లక్షలు ఆదాయం మాత్రమే వచ్చింది. అత్యధికంగా గుడిపాల మండలం రామభద్రాపురంలో 22, గుడుపల్లి మండలం గుండ్లసాగరంలో 08, గంగాధరనెల్లూరు మండలం అగరమంగళంలో 05, మిగిలిన 66 సచివాలయాల్లో 75 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి.

ఐదుగురు తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో స్వల్ప మార్పులు చేస్తూ సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. కుప్పం ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించిన టి.సీతారామ్‌ను గుడుపల్లి తహసీల్దార్‌గా నియమించారు. తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వచ్చిన ఎం.లోకేశ్వరిని చిత్తూరు రూరల్ తహసీల్దార్‌గా నియమించగా, గుడుపల్లి తహసీల్దార్ బి.రామాంజులు నాయక్‌ను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. కర్నూలు ఉమ్మడి జిల్లా నంద్యాల నుంచి జిల్లాకు వచ్చిన ఐ.మురళీమోహన్‌ను గతంలో పెద్దపంజాణి తహసీల్దార్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయన్ను పబ్లిక్ గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కలెక్టరేట్‌లో మానిటరింగ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లాకు చెందిన జి.జయప్రకాష్‌ను చిత్తూరు జిల్లాకు కేటాయించగా, ఆయన్ను కుప్పం ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా నియమించారు.

టీచర్స్ వర్క్ అడ్జస్ట్‌మెంట్ వాయిదా

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 12: జిల్లా విద్యాశాఖలో సోమవారం నుంచి మొదలు కావాల్సిన ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ మరోసారి వాయిదా పడింది. తమ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోవాలని ఫ్యాప్టో కోరడంతో ఈ నెల 16వ తేదీ వరకు ఈ అంశంపై విజ్ఞప్తుల స్వీకరణ, 17న పరిశీలన అనంతరం ప్రక్రియ చేపట్టే వీలుంది.

నీలం మామిడి టన్ను రూ.2.20 లక్షలు

బంగారుపాళ్యం, ఆగస్టు 12: మేలైన నీలం మామిడి టన్ను రూ.2.20 లక్షలు పలికింది. సోమవారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వి.కోట మండలం ఎస్.బండపల్లికి చెందిన రైతు కె.వి.ప్రసాద్ ఒకటిన్నర టన్ను నీలం రకం మామిడి తీసుకొచ్చారు. వేలంపాట ద్వారా బెంగళూరుకు చెందిన వ్యాపారవేత్త గణేష్ టన్ను రూ.2.20 లక్షలకు కొనుగోలు చేశాడు. అధిక ధర పలకడంతో రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మామిడి సీజన్ ముగిసింది.

కాణిపాక ఆలయ ఈవో బదిలీ



ఈవో వెంకటేశు



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 12: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో వెంకటేశును బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాతృశాఖకు బదిలీ చేస్తూ జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టులో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ 2020 జూన్ 5న ఈవోగా ఇక్కడికి వచ్చారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఆయన్ను మాజీ మంత్రి పెద్దిరెడ్డి అండదండలతో దేవాదాయ శాఖకు డిప్యూటేషన్‌పై తీసుకువచ్చి ఈవోగా నియమించారు. 2022 ఏప్రిల్ 16 తర్వాత తిరిగి మాతృశాఖకు బదిలీ చేశారు. అయితే ప్రత్యేక జీవో ద్వారా 2022 నవంబరు 18న మళ్లీ కాణిపాక ఆలయ ఈవోగా తీసుకొచ్చారు. ఏడాది కాలానికి డిప్యూటేషన్‌పై ఈవోగా నియమితులైన వెంకటేశు మరో ఏడాది కాలాన్ని పొడిగించుకుని ఈవోగా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో ఆలయ ఈవోగా ఎవరినీ నియమించలేదు.

ఉభయదారులు, స్థానికుల సంబరాలు

బదిలీపై సంబరాలు

కాణిపాక ఆలయ ఈవో వెంకటేశు బదిలీతో ఉభయదారులు, గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. వరదరాజ స్వామి ఆలయం, బస్టాండ్ సర్కిల్ వద్ద టపాకాయలు పేల్చారు. గతంలో ఏ ఈవో బదిలీ అయినప్పుడు సంబరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఆయన నియంత ధోరణితో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని అటు ఉభయదారులు, ఇటు గ్రామస్తులు పేర్కొనడం కొసమెరుపు.

వేధించి..హత్యకు గురయ్యాడు


హతుడు మొగిలీశ్వర (ఫైల్ ఫొటో)


పలమనేరు ఆగస్టు 12: సామాజిక కట్టుబాట్లకు విలువ ఇవ్వని బంధాలు చివరికి విషాదాంతమవు తాయని మొగిలీశ్వరయ్య హత్య ఘటన మరోసారి వెల్లడిస్తోంది. పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలో సహ జీవనం చేస్తున్న స్త్రీని వేధిస్తూ ఆమె చేతిలోనే కత్తిపోట్లకు గురై మొగిలీశ్వరయ్య కన్నుమూశాడు. అరగొండ సమీపంలోని వెంగంపల్లికి చెందిన మొగిలీశ్వరయ్యకు పలమనేరు పల్లివీధిలోని యువతితో పెళ్లయింది. ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు ఉన్నారు. మేస్త్రీ పనిచేసే ఇతను గంగవరం మండలం యామనపల్లికి చెందిన మంగమ్మ అనే వివాహితకు దగ్గరయ్యాడు. ఆమెకు కూడా ఇద్దరు పిల్లలున్నారు. మొగిలీశ్వరయ్య, మంగమ్మ నాలుగేళ్లుగా పలమనేరు లక్ష్మీనగర్‌కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం సాగిస్తు న్నారు. తరచూ తాగి వచ్చి మంగమ్మతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం అర్ధరాత్రి కూడా వీరి మధ్య గొడవ జరిగింది. మంగమ్మను మొగిలీశ్వరయ్య కొట్టాడు. దీంతో ఆమె చాకుతో మొగిలీశ్వరయ్యను పొడిచింది. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి జరిగిందంతా చెప్పింది. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకునేప్పటికే మొగిలీశ్వరయ్య రక్తపుమడుగులో విగత జీవుడై పడి ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేటి నుంచి కడపలో స్టాఫ్‌నర్సు కౌన్సెలింగ్

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్ నర్సులుగా పనిచేసేందుకు మెరిట్ ఆధారంగా ఎంపికైన 206 మందికి మంగళవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు కడప ఆర్‌డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ తేదీలను www.hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆయా తేదీఈల్లో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 9440290777, 93819050378లను సంప్రదించాలని తెలిపారు.

షార్ వేదికగా నేడు అంతరిక్ష దినోత్సవాలు

● హాజరు కానున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


షార్ కేంద్రం

సూళ్లూరుపేట, ఆగస్టు 12: ఈనెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నెల రోజులపాటు భారత ప్రభుత్వం, ఇస్రో, షార్ సంయుక్త ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్ర ప్రదేశ్, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని ఒఆర్ కురుఫ్ ఆడిటోరియంలో అంతరిక్ష దినోత్సవాలను నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ వేడుకలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో పాల్గొంటారు. షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్‌తోపాటు రాకెట్ ప్రయోగవేదికలను, స్పేస్ మ్యూజియాన్ని పవన్‌కల్యాణ్ సందర్శించనున్నారు.

యూపీలో అదృశ్యమైన స్వామీజీ

శ్రీకాళహస్తిలో ప్రత్యక్షం


గురు సరా నందాజీ మహరాజ్

శ్రీకాళహస్తి,ఆగస్టు12:ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీ మహరాజ్ స్వామి శ్రీకాళహస్తిలో ప్రత్యక్షమయ్యాడు. తిరుపతి జిల్లాలో ఆయన కదలికలు ఉన్నాయన్న అనుమానంతో పోలీసు యంత్రాంగం రెండురోజులుగా గాలింపు చేపట్టింది. శ్రీకాళహస్తి పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో సోమవారం ఆయన ఉన్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గురు సరా నందాజీమహరాజ్‌స్వామి కొద్దిరోజుల క్రితం ఆయన ఆవాసం ఉండే ఆశ్రమం నుంచి అదృశ్యమయ్యాడు.అత్యంత ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్న ఆయన కోసం కొద్దిరోజులుగా వెతుకులాట జరిగింది. తిరుపతి జిల్లా పరిధిలో స్వామిజీ కదలికలు ఉన్నట్లు పోలీసుశాఖ అధికారులకు సమాచారం వచ్చింది. రెండురోజుల పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పలు పోలీసు ప్రత్యేక బృందాలతోపాటు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది గాలించారు. ఎట్టకేలకు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే నరేష్ అనే కానిస్టేబుల్ పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో స్వామిజీని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తిరుపతి నుంచి ప్రత్యేక బృందం శుకబ్రహ్మాశ్రమానికి చేరుకుని ఆయనను విమానాశ్రయానికి తరలించి అక్కడి నుంచి యూపీకి పంపారు.

17న జిల్లాకు ఉప రాష్ట్రపతి దంపతుల రాక

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 12: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ దంపతులు ఈనెల 17వ తేదీన జిల్లాకు విచ్చేయనున్నట్లు అధికారులు తెలిపారు. నెల్లూరు జిల్లా వెంకటాచలంలో జరగనున్న 23వ వార్షిక స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొననున్నారు. 17న ఉదయం 8.35గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన విమానంలో బయల్దేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.50గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ప్రత్యేక వాయుసేన హెలికాప్టర్‌లో బయల్దేరి నెల్లూరులోని పోలీస్‌గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన వెంకటాచలంలోని అక్షర విద్యాకేంద్రానికి వెళతారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శిస్తారు. ఉదయం 11.50గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడితో కలిసి 23వ స్వర్ణభారత్ ట్రస్టు ఉత్సవాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు నెల్లూరు పోలీస్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. 3.45గంటలకు ప్రత్యేక వాయుసేన విమానంలో తిరుపతి విమానాశ్రయంనుంచి ఢిల్లీ బయల్దేరి వెళతారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం ఒకరోజు వాయిదా

సూళ్లూరుపేట, ఆగస్టు 12 : శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం షార్ నుంచి ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం ఒక రోజు వాయిదా పడింది.ఈ నెల 16న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.ఇస్రో అధికారులు తొలుత ఈ ప్రయోగాన్ని ఆగస్టు 15న ప్రయోగించేందుకు ఏర్పాట్లు చేశారు. షార్‌లో ఆగస్టు 13న అంతరిక్ష దినోత్సవాలు, 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉండడంతో ప్రయోగాన్ని ఒకరోజు వాయిదా వేసినట్లు ఇస్రో వర్గాల సమాచారం. ఆగస్టు 16న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఇస్రో రూపొందించిన మూడో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ-డీ 3 ప్రయోగం చేపట్టనున్నారు. రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఉపగ్రహం చుట్టూ ఉష్ణకవచం అమర్చి తుది పరీక్షలను పూర్తిచేశారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మంగళవారం షార్‌లో ప్రయోగంపై శాస్త్రవేత్తలతో సమావేశం కానున్నట్లు తెలిసింది.

హాథీరాంజీ మఠం ఇన్‌చార్జి ఏవోగా రామారావు



తిరుపతి అర్బన్, ఆగస్టు 12: హాథీరాంజీ మఠం ఇన్‌చార్జి పరిపాలన అధికారి (ఏవో)గా ఈవో కె.ఎస్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న ఫిట్‌పర్సన్ రమేష్‌నాయుడిని ప్రభుత్వం మాతృసంస్థకు బదిలీ చేసింది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవోగా ఉన్న రామారావుకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా మఠం అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం మొండి బకాయిల వసూళ్లపై ఇన్‌చార్జి ఏవో ఆదేశాలిచ్చారు. దాంతో ఏఈవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొన్ని దుకాణాల నుంచి వసూలు చేయగా, మిగిలిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. మఠం సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, గంగాధరం, మణిభూషణ్‌రావు, శ్రీనివాసులు, రాము, నరసింహచార్యులు, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.89 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 86,604 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,536 మంది తలనీలాలు సమర్పించారు.

కలెక్టరేట్‌కు 200... పోలీసుశాఖకు 50 అర్జీలు

చిత్తూరు, ఆగస్టు12: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో అధికారులతోకలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ చందోలు వినతులను స్వీకరించారు. నిర్ణీత సమయంలోగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని....

● యానాది కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పెనుమూరు మండలం కల్వకుంట పంచాయతీ ఎస్టీకాలనీ వాసులు కోరారు.

● 35 ఏళ్ల క్రితం నిర్మించిన కాలనీ ఇళ్లల్లో నివాసముంటున్నామని, ఆ ఇళ్లన్నీ ఇప్పుడు వర్షాలు వస్తే ఉరుస్తున్నాయని యాదమరి మండలం కీనాటంపల్లె పంచాయతీ షికారీ కాలనీ వాసులు తెలిపారు. షికారీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్టీయార్ గృహ నిర్మాణ పథకం ద్వారా కొత్తగా ఇళ్లను కట్టివ్వాలని కోరారు.

● సంఘమిత్ర సుజాత చేసిన అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకు తమను గ్రూపు నుంచి తొలగించారని నింద్ర మండలం పాదిరి గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘ సభ్యురాలు ద్రాక్షాయణి ఫిర్యాదు చేశారు. తాను గ్రూపులో మొదటి లీడర్‌గా ఉన్నానని, తనకు తెలియకుండానే సుజాత బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో డబ్బులను డ్రా చేసి స్వాహా చేసిందన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి సుజాతపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

● తమ జీవనాధారమైన భూములను సర్వే చేసి అప్పగించాలని చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లెకు చెందిన ఓ దళిత కుటుంబం వాపోయింది. తమ ఉమ్మడి వ్యవసాయ భూమి చిత్తూరు, యాదమరి మండలాల సరిహద్దులో ఉన్నాయని తెలిపారు. తమ కుటుంబానికి చెందిన వనమ్మ చదువుకోలేదని, ఆమె సంతకం చేసినట్లుగా ఫోర్జరీ పత్రాల్ని సృష్టించారని ఆరోపించారు. ఎకరం భూమి ఆక్రమణకు గురై అక్కడే ఉన్న పరిశ్రమ అనుభవంలో చేరిందన్నారు. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని సాలమ్మ, తదితరులు కోరారు.

● కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 200 మంది అర్జీదారులు హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. వాటిలో రెవెన్యూశాఖకు 166, నేషనల్ హైవేకకు 06, సర్వేశాఖకు 03, మిగిలిన డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, పంచాయతీరాజ్, అటవీశాఖ తదితర శాఖలకు సంబంధించి 25 అర్జీలందాయి. జేసీ శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

● పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి 50 మంది అర్జీదారులు హాజరయ్యారు. ఇందులో భూ తగాదాల కింద 17, డబ్బు తగాదాలు 07, ఆస్తి తగాదాలు 06, వేధింపులు 05, భర్త వేధింపులు 02, బైక్‌చోరీ 02, చీటింగ్, ఇంటి తగాదాలు, దారి సమస్యల కింద ఒక్కో అర్జీవంతున అందాయి.



అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ చందోలు

నా భూమి నాకు ఇప్పించండి

ఆర్డీవో గ్రీవెన్స్‌కు 19 అర్జీలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: 'నా భూమిని నాకు తెలియకుండా మా అన్న తన పేరుతో రాసుకున్నాడని, ఇప్పించాలని బంగారుపాళ్యం మండలం మొగిలి వెంకటగిరి గ్రామానికి చెందిన జగదీశ్వరన్ చిత్తూరు ఆర్డీవో చిన్నయ్యను వేడుకున్నాడు. ఈ మేరకు సోమవారం చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో వినతిపత్రం అందజేశాడు. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి గ్రామంలో సర్వే నెం.76/1లో 2.24 ఎకరాలను అన్న నగరాజన్‌తో కలిసి కొనుగోలు చేశామన్నారు. ఇద్దరం కలిసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, అయితే తనకు తెలియకుండా తన అన్న మొత్తం భూమిని తన పేరుతో పట్టాదారు పుస్తకం చేయించుకున్నాడని తెలిపారు. దీనిపై అప్పటి తహసీల్దార్‌ను అడిగినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం చేయాలని కోరాడు.

● రేషన్ సరుకులు సరిగా ఇవ్వడం లేదు

పూతలపట్టులోని ఒక రేషన్ షాపులో మూడు రోజులకు మించి రేషన్ సరుకులు ఇవ్వడం లేదని కార్డుదారులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. తర్వాత వెళ్లే వారికి సరుకులు అయిపోయాయని చెబుతున్నారని తెలిపారు. ప్రతినెలా ఇదే తంతుగా మారిందని, డీలర్‌పై చర్యలు తీసుకుని తమకు సరుకులు ఇప్పించాలని కోరారు.


దారి కల్పించాలని కోరుతున్న చెంగల్రాయరెడ్డి కుటుంబ సభ్యులు

● పొలానికి దారి కల్పించండి

తమ పొలానికి దారి లేకుండా ప్రభుత్వ భూమిలో మామిడి చెట్లు నాటుకుంటున్నాడని, న్యాయం చేయాలని వెదురుకుప్పం మండలం మాకమాంబాపురానికి చెందిన చెంగల్రాయరెడ్డి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సర్వేనెంబరు 187/1, 186/1, 185/1, 184/4,6 లో పశువుల మేత పొరంబోకు, బండిబాట, కాలువ పొరంబోకు, కుంట ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన హరిఓమ్ ఆ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నాడని, గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా నిలిపేసి, ఇప్పుడు ఏకంగా మామిడి మొక్కలు నాటుతున్నాడని తెలిపారు. కాగా గ్రీవెన్స్‌డకు మొత్తం 19 అర్జీలు వస్తే అన్నీ భూ సమస్యలకు సంబంధించిన అర్జీలే వచ్చాయని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: ఈనెల 16 నుంచి వచ్చే నెల 30వ తేదీ వరకు 45 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న సదస్సుల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జేసీ శ్రీనివాసులుతో కలిసి తహసీల్దార్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీశాఖ అధికారులు పాల్గొనాలన్నారు. ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ నియామకంతో పాటు ఆర్డీవోలు వారి రెవెన్యూ డివిజన్ల పరిధిలో జరిగే సదస్సులను పర్యవేక్షించాలన్నారు. పెద్ద డివిజన్లలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను కూడా పర్యవేక్షణకు నియమించాలని డీఆర్వోను ఆదేశించారు. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ పాల్గొన్నారు.


తహసీల్దార్లకు సూచనలిస్తున్న కలెక్టర్

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

విషాదంలో కుటుంబీకులు



బైరెడ్డిపల్లె, ఆగస్టు 12 : మండలంలోని గొల్లచీమనపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నవీన్‌కుమార్ (32) గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన రాజారెడ్డి కుమారుడు నవీన్‌కుమార్ హర్యానాలో ఏడేళ్లుగా ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. సెలవులపై నెల రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి మూడు రోజులకు ముందు హర్యానాకు వెళ్లారు. ఢిల్లీ నుంచి ఆదివారం బస్సులో హర్యానాకు వెళుతుండగా గుండెపోటు వచ్చి మృతిచెందినట్లు కుటుంబీలకు సమాచారం అందింది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. నవీన్‌కుమార్ భౌతికకాయానికి హర్యానాలో అక్కడి ఆర్మీ అధికారులు అధికార లాంఛనాలతో నివాళులర్పించారు. భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం గొల్లచీమనపల్లెకు తీసుకువస్తారని, అదే రోజు అంత్యక్రియలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.


నవీన్‌కుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు(ఇన్‌సెట్‌లో)నవీన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.51.09 లక్షల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

తిరుమల, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహణలోని ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.51.09 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌లోని పునర్వసు ఆయుర్వేద కంపెనీకి చెందిన బొమ్మ వెంకటేశ్వరరెడ్డి ఈ విరాళపు మొత్తాన్ని చెక్ రూపంలో తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

చోరీ కేసులో బాలుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 12: దొంగతనం కేసులో 17యేళ్ల బాలుడికి ఏడాది సాధారణ జైలు శిక్ష విధిస్తూ జువైనల్ జస్టిస్ బోర్డు తీర్పు చెప్పింది.చిత్తూరుకు చెందిన ఓ బాలుడు గతేడాది తిరుపతి రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో దొంగతనం చేసి దొరికిపోయాడు.కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. దాదాపు ఏడాదిపాటు సాగిన ఈ కేసులో దోషికి సంవత్సరంపాటు సాధారణ జైలు విధిస్తూ తీర్పు చెప్పారు.

అడవుల పరిరక్షణతో ఏనుగుల సంరక్షణ

ఘనంగా వరల్డ్ ఎలిఫెంట్ డే

కుప్పం/రామకుప్పం, ఆగస్టు 12: అడవులను పరిరక్షించడం ద్వారా ఏనుగుల సంరక్షణ సాధ్యమవుతుందని కడా ప్రాజెక్టు ఆఫీసర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కుప్పంలో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఏనుగులు సాధు జంతువులని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. రామకుప్పం మండల పరిధిలోని ముద్దనపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో రామకుప్పం అటవీ డిప్యూటీ రేంజ్ అధికారి ధనుంజయుడు అటవీ సిబ్బంది, టీడీపీ నేతలతో కలిసి మొక్కలు నాటారు. ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగులు జయంత్, వినాయక్‌లకు స్నానపానాదులు చేయించి, ప్రత్యేక రంగులతో అలంకరించారు. వాటికి పూజలు చేసి, పండ్లు, ఫలహారాలు అందజేశారు. అటవీ సిబ్బంది ననియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏనుగుల కదలికలు, ఏనుగుల దాడి నుంచి తప్పించుకునే మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎఫ్ఆర్‌వో జయశంకర్‌తోపాటు డీఆర్వోలు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, బీసీసెల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మనోహర్, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, సీనియర్ నేతలు రామ్మూర్తి, జేయి, రఘు, నందీశ్వర్, నాగరాజు, సుబ్రహ్మణ్యంనాయుడు, మంజునాథ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.


జయంత్, వినాయక్‌తో ననియాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు

వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో 4వ స్థానం ● ర్యాంకులను విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్



తిరుపతి రూరల్, ఆగస్టు 12: దేశంలోని వ్యవసాయ అనుబంధ రంగాల (అగ్రికల్చరల్ అండ్ అల్లైడ్ సెక్టార్స్) వర్సిటీలకు 2024 సంవత్సరానికి భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ సంస్థ (ఎన్ఐఆర్ఎఫ్) సోమవారం ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో తిరుపతి కేంద్రంగా నడిచే ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి 33వ ర్యాంకు లభించింది. 74 వ్యవసాయ అనుబంధ రంగాల వర్సిటీలకు ఈ ర్యాంకులను ప్రకటించగా 46.41 స్కోరుతో 33వ ర్యాంకును కైవసం చేసుకుందని వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య తెలిపారు. వెటర్నరీ వర్సిటీల కేటగిరీల్లో దేశంలో 4వ స్థానంలో నిలిచిందన్నారు. గత ఏడాది వర్సిటీ 31వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 33కు పరిమితమైందన్నారు. వర్సిటీల కేటగిరీలో మాత్రం గత ఏడాది లాగే ఈ సారి కూడా నాల్గవ స్థానాన్ని సాధించిందని వివరించారు. ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ సాధించిన పురోగతికితోడుగా అధ్యాపకులు, ఉద్యోగుల సమన్వయంతో పనిచేయడం వల్ల ఉత్తమ స్థానాన్ని సాధించగలిగామన్నారు. ఇకపై కూడా సమష్టిగా పనిచేసి రానున్న ఏడాదిలో మెరుగైన స్థానాన్ని సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇప్పటికే దేశంలోనే న్యాక్ గుర్తింపు పొందిన తొలి వెటర్నరీ వర్సిటీగా గుర్తింపు ఉందన్నారు. కాగా, ర్యాంకింగ్స్‌పై వర్సిటీ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

తిరుపతి-కాట్పాడి మధ్య ఆరురోజులపాటు రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 12: తిరుపతి - కాట్పాడి మధ్య ఆరు రోజులపాటు ప్రత్యేక రైళ్లు (07659-07582) రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఈనెల 13, 20, 25, సెప్టెంబరు 1, 8, 16 తేదీల్లో మధ్య పలు రైళ్ల రాకపోకలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి-విల్లుపురం మధ్య నడుస్తున్న రెగ్యులర్ రైళ్లు (16853-16854) కూడా తిరుపతి- కాట్పాడి మధ్య పైన తెలిపిన తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. అలాగే కాట్పాడి- జోలార్‌పేట మధ్య ప్రత్యేక రైళ్ల(06417-06418)ను కూడా పైతేదీల్లో రద్దు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ అసౌకర్యాన్ని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జానకీరావు

కల్లూరు, ఆగస్టు 12: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి జానకీరావు, మండల న్యాయ సేవా సంస్థ ప్యానల్ అడ్వకేట్ ఎస్ఎస్ఎం సలీం సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కల్లూరు పంచాయతీలో సోమవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మందులు పంపిణీ చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ



పలమనేరు, ఆగస్టు12 : కర్ణాటక రాష్ట్రం కోలారు నియోజకవర్గ ఎమ్మెల్యే మంజునాథ్ సోమవారం తిరుమల నిత్యాన్నదాన కార్యక్రమం కోసం వివిధ రకాలకు చెందిన 10 టన్నుల కూరగాయలను పంపించారు. పలమనేరుకు చెందిన శ్రీవారి భక్తుడు కాప్పల్లి రవీంద్రరెడ్డి అభ్యర్థన మేరకు మంజునాథ్ అవసరమున్నప్పుడల్లా స్వామివారికి కూరగాయలను పంపుతున్నారు. టీటీడీకి కూరగాయలను తీసుకెళ్లేందుకు అన్నదాన ట్రస్టుకు ఎమ్మెల్యే మంజునాథ్ వాహనాన్ని కూడా అందజేశారని రవీంద్రరెడ్డి తెలిపారు.

పలమనేరులో ఏనుగుల దినోత్సవ ర్యాలీ



పలమనేరు, ఆగస్టు12 : అటవీశాఖ అధ్వర్యంలో సోమవారంనాడిక్కడ జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అటవీ శాఖ కార్యాలయం వద్ద రేంజర్ శివన్న విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఏనుగుల దినోత్సవం గురించి వివరించారు. విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది అటవీశాఖ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు.

తహసీల్దార్ జయసింహకు సన్మానం



కల్లూరు, ఆగస్టు 12: పులిచెర్లలో సోమవారం తహసీల్దార్ జయసింహను టీడీపీ నాయకులు సన్మానించారు. ఇటీవల ఈయన బాధ్యతలు చేపట్టారు. దీంతో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీలు రెడ్డి అహ్మద్, మునికృష్ణమనాయుడు, రాశిప్రసాద్, నాయకులు గోపినాయుడు, రామకృష్ణమనాయుడు, రామనాథంనాయుడు, పరందామనాయుడు, పార్థసారథి, చైతన్య, రమేష్ ఉన్నారు.

తమిళనాడులో జీలూబాయ్‌కి సత్కారం



పలమనేరు, ఆగస్టు12 : లారీ వర్కర్స్, యజమానులకు, అభాగ్యులకు సేవలందిస్తున్న జీలూబాయ్‌ని ఆదివారం రాత్రి తమిళనాడులో ఘనంగా సన్మానించారు. కన్యాకుమారి సమీపంలోని కోవిల్పట్టిలో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు, చిన్న వాహనాల యజమానులకు అండగా వాహనసేనై అనే సంస్థను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు పలమనేరుకు చెందిన జీలూబాయ్‌ని సన్మానించారు.

గ్రామ వ్యవహారాలపై నిరంతర శ్రద్ధ

సదుం, ఆగస్టు 12: గ్రామాభివృద్ధి, సమస్యల పరిష్కారంపై సిబ్బంది నిరంతర శ్రద్ధ వహించాలని ఎంపీడీవో రాజశేఖర్ సూచించారు. పంచాయతీ పాలన, పాటించాల్సిన ప్రధాన అంశాలపై సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి ప్రత్యేక సమావేశం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ వరప్రసాద్, సర్పంచు రమణ, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి


డీఎంతో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

కుప్పం, ఆగస్టు 12: మండలంలోని వివిధ మార్గాల్లో అనేక కారణాలతో గతంలో ఆపివేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. పలువురు గ్రామస్తులతో కలిసి ఆయన సోమవారం ఆర్టీసీ డీఎంను కలిశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు సౌర్యం ఉన్న ప్రతి గ్రామానికి సర్వీసులు పునరుద్ధరించాలన్నారు. రద్దీని బట్టి వీలైనన్ని సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటానని డీఎం హామీ ఇచ్చారు. పెద్దబంగారునత్తం సర్పంచి రోహిత్ రవి, పాపన్న, డాక్టర్ వెంకటేష్, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ క్వారీపై చర్యలు తీసుకోవాలని ధర్నా



పలమనేరు, ఆగస్టు12 :కొలమాసనపల్లి సమీపంలో అక్రమంగా నడుస్తున్న క్వారీపై వెంటనే మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. కొలమాసనపల్లి సమీపంలోని క్వారీలో ఆదివారం చిన్నస్వామి అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన నేపథ్యంలో వీరు ఆందోళన చేపట్టారు. అక్రమ మైనింగ్, అక్రమ విద్యుత్ సరఫరా కారణంగానే చిన్నస్వామి అనే కార్మికుడు మృతిచెందాడని అధికారులకు ఫిర్యాదు చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, చిన్నస్వామి మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాలాజినాయుడు, చెంగారెడ్డి, ప్రహ్లాద, శ్యాం, నవీన్‌కుమార్, హైదర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

కుప్పంలో కడియం మొక్కల గ్రీనరీ


మొక్కలు నాటుతున్న కార్మికులు

కుప్పం, ఆగస్టు 12: కుప్పం మున్సిపాలిటీని గ్రీన్ మున్సిపాలిటీగా మార్చే క్రమంలో కడియం మొక్కలను అధికారులు తీసుకొచ్చారు. వివిధ రకాల అవెన్యూ మొక్కలను సోమవారం వాహనాల ద్వారా మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేర్చారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు కౌన్సిలర్లు దగ్గరుండి ఈ మొక్కలను డివైడర్లలో నాటించారు. పచ్చదనాన్ని పెంచే క్రమంలో భాగంగా మొక్కలను నాటిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తీరుపై పెదవి విరుపు



ఆసుపత్రి వెలుపల వాలిపోయిన సీసీ కెమెరా

పలమనేరు, ఆగస్టు12 : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుత సీసీ కెమెరాలు ఏడు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. కెమెరాలు చేతికి అందుతుండటంతో కొందరు మరింత కిందకు వంచేస్తున్నారు. ఫలితంగా ఆసుపత్రి వెలుపల కార్యకలాపాలు తెలుసుకునేందుకు వీలు లేకుండా పోతోంది. విశాలమైన వరండా ఉన్నా ఒక్క కెమెరా కూడా ఏర్పాటు చేయకపోవడం విచారకరం. అధికారులు స్పందించి సరైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట


గ్రానైట్ లారీని అడ్డుకున్న గ్రామస్థులు

కుప్పం రూరల్, ఆగస్టు 12: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీనుంచి జరుగుతున్న అక్రమ రవాణాను సోమవారం పరిసర ప్రజలు అడ్డుకున్నారు. గుడ్లనాయనిపల్లె, ఊరినాయని కొత్తూరులకు వెళ్లే మట్టిరోడ్డులో రెండు లారీల్లో గ్రానైట్ బండలు అక్రమ రవాణా అవుతున్నట్లు గ్రామస్థులు తెలుసుకున్నారు. వెంటనే వెళ్లి రెండు లారీలను అడ్డుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వాహనాలను సీజ్ చేశారు.పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మంత్రి రవీంద్రను కలిసిన కుప్పం నేతలు



కుప్పం, ఆగస్టు 12: కుప్పం టీడీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకిర్, నాయకుడు ఫైరోజ్‌లు సోమవారం మచిలీపట్నంలో గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కుప్పం, ఆగస్టు 12: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఖాదర్‌బాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి అధికారులంతా హాజరు కావాలన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకారం


తాజ్ మస్రూర్

గుడుపల్లె, ఆగస్టు 12: స్థానిక ఎంపీడీవోగా తాజ్ మస్రూర్‌ను నియమిస్తు జడ్పీసీ ఈవో గ్లోరియా ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల సమయంలో ఈయన్ను నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. తాజా బదిలీల్లో ఆయన గుడుపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను అధికారులు, నాయకులు సన్మానించార్యు

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

శాంతిపురం, ఆగస్టు 12: మద్యం తాగి వాహనం నడిపిన సొన్నేగానిపల్లెవాసి బాబును సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు. కుప్పం కోర్టులో హాజరు పరచగా అతనికి ఆరునెలలు జైలు శిక్ష, లేదా రూ.5000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారన్నారు. మైనర్లు వాహనాలు నడిపేందుకు తల్లిదండ్రులు అంగీకరించరాదన్నారు.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

రామకుప్పం, ఆగస్టు 12: రామకుప్పం పట్టణ శివార్లలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 13, ఎస్టీ కేటగిరిలో 1, 6వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 2, 7వ తరగతిలో ఎస్టీ కేటగిరిలో 1, 8వ తరగతిలో ఎస్టీ కేటగిరిలో 1, 9వ తరగతిలో ఎస్టీ కేటగిరిలో 2, బీసీ, ఓసీ కేటగిరిల్లో 1 చొప్పున, ఇంటర్ మొదటి సంవత్సరం(ఎంపీసీ)లో ఎస్సీ, ఓసీ కేటగిరిల్లో 1 చొప్పున సీట్లకు ఈ నెల 13, 14తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు బుధవారం సాయంత్రం 5గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ పరీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి

పుంగనూరు రూరల్, ఆగస్టు12: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అద్దాల నాగరాజు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులు ఆర్థికం, విద్య, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తున్నట్లు నమ్మించి అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఈదిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యాంక్ ఖాతాలో రూ.69వేలు మాయం

పెద్దపంజాణి, ఆగస్టు 12: యూనియన్ బ్యాంకు అకౌంట్‌లో రూ.69 వేలు మాయమైనట్లు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. మద్దలకుంటకు చెందిన లలితమ్మకు స్థానిక యూనియన్ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ ఉంది. గత శుక్రవారం రాత్రి రూ.50వేలు,రూ.19వేలు విత్‌డ్రా అయినట్లు గుర్తు తెలియని ఓ మొబైల్ నంబరు నుంచి మెసేజ్ రావడంతో బాధితురాలు అవాక్కయింది. వెంటనే క్రైం బ్రాంచ్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. బిహార్‌కు చెందిన షరీఫ్ అకౌంట్‌లో ఈమొత్తం జమ అయినట్లు పోలీసులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు12: పుంగనూరు-రామసముద్రం మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు... సోమవారం రామసముద్రానికి చెందిన పుండు కిషోర్, నారాయణాచారి,ఎర్రప్పచారి కలిసి కారులో పలమనేరు వెళ్తున్నారు. నరసాపురం సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా పడింది. కారు డ్రైవర్ కిషోర్, నారాయణాచారి, ఎర్రప్పచారిలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం బోల్తా : యువకుడికి గాయాలు

సోమల, ఆగస్టు 12: నంజంపేట రోడ్డుపై నీట్వి గుంతలో పడి ద్విచక్ర వాహనదారుడికి గాయపడ్డాడు. శీలయ్యగారిపల్లెకి చెందిన ముకేశ్ ద్విచక్రవాహనంలో చౌడేపల్లెకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అతని కాలుకు తీవ్ర గాయమైంది.

చెప్పుల దుకాణం దగ్ధం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 12 : బైరెడ్డిపల్లె నాలుగు రోడ్ల కూడలి వద్ద చెప్పుల దుకాణం ఆదివారం అర్ధరాత్రి దగ్ధమైంది. నవాబ్‌బాషాకు చెందిన దుకాణంలో దాదాపు రూ. 5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవు

● అధికారులకు కడా పీడీ హెచ్చరిక


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 12: అధికారుల తీరుపై కడా పీడీ వికాస్ మర్మత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల సచివాలయంలోని సమావేశం హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరిగింది. వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించి 52 అర్జీలు వచ్చాయి. రెవెన్యూ సమస్యలపైనే 26 అందాయి. ఈ అర్జీలను శాఖలవారీగా విభజించారు. వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను పీడీ ఆదేశించారు. అనంతరం వికాస్ మర్మత్ మాట్లాడుతూ ప్రభుత్వంలోని 17 శాఖలు సమన్వయంతో సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచించి అమలు చేయాలన్న సదుద్దేశంతో కడా ఏర్పాటైందన్నారు. చాలామంది అధికారులకు సీఎం లక్ష్యం అర్థమైనట్లు లేదన్నారు. కనీసం గ్రీవెన్స్ సెల్‌కు కూడా కొంతమంది ఆలస్యంగా హాజరవుతున్నారన్నారు. ఏదైనా పని అప్పగిస్తే సాకులు వెతుకుతున్నారన్నారు. ప్రణాళికల రూపకల్పనలో కూడా సహకారం అంతంతమాత్రంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. తప్పనిసరిగా పనిలో వేగం పెంచాలన్నారు. పనితీరు మార్చుకోవాలని ఆదేశించారు. ప్రజల అర్జీల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. 15 రోజులకు ఒకసారి తనతో సహా అధికారులు నియోజకవర్గంలోని మూడు గ్రామాలను సందర్శించి ప్రజల అవసరాలు గమనించి, తీర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం సెక్రటరీ ప్రద్యుమ్న నేరుగా కుప్పం నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఇక్కడ ప్రతి పనినీ, అర్జీల పరిష్కారాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తున్నారన్నారు. కడాకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ రూపొందించి, అందులో ఎప్పటికప్పుడు జరుగుతున్న పనులు, ఇతర సమాచారం అప్‌లోడ్ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వచ్చేలోగా ఆదర్శ నియోజకవర్గంగా రూపొందడానికి తగిన కసరత్తు జరుగుతుందనే నమ్మకం కలిగించాలన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అధికారులను కడా పీడీ హెచ్చరించారు.

ర్యాలీలో రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు



పుంగనూరు. ఆగస్టు12: పట్టణంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్ఎస్‌పేట నుంచి జమీందార్ పాల్యెస్, కమ్మరవీధి, ప్రయివేటు బస్టాండ్ మీదుగా భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ చేరుకుంది. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. లయన్స్, రోటరీ క్లబ్, మానవతాసేవా సంస్థ, క్షత్రియ, ఆర్యవైశ్య, రెడ్డిసంఘ, క్షకృష్ణదేవరాయుల సంఘం, వివేకనంద, భవన కార్మికులసంఘం, హిందూజాగరణ సమితి, బహిరంగదళ్,ఆర్ఎస్ఎస్, , ఎన్డీయే కూటమీ, మాజీ సైనికులు, ఏపీ అబ్దుల్‌కలాం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, మేధావులు, పట్టణ ప్రముఖులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు రాజారెడ్డి, మదన్‌మోహన్, లోకేశ్, త్రిమూర్తిరెడ్డి, శేఖర్, హరిప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రాజు, శరణ్‌కుమార్‌రెడ్డి, కేశవరెడ్డి, నానబాల గణేశ్, ముత్యాలు, భాస్కర్‌జెట్టి పాల్గొన్నారు.

వైభవంగా తిమ్మరాయస్వామి ఉత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

గుడుపల్లె, ఆగస్టు 12: శిరిగిరిపల్లెలోని ప్రసన్న తిమ్మరాయస్వామి దేవాలయంలో శావణ సోమవారం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, రాళ్లగంగమ్మ, కుంటి గంగమ్మ,ద్రౌపది ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఊరేగించారు. రాత్రి పుష్పాపల్లకి, పచ్చగెరిగ, నయ్యాడి నృత్య ప్రదర్శన, బాణు వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

విద్యావనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయుల నిరసన



పలమనేరు, ఆగస్టు12 : మండల విద్యావనరుల కేంద్రం వద్ద సోమవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను బహిష్కరించామన్నారు. జీఓ 53 ప్రకారం సర్దుబాటు చేయాలన్నారు. సీనియారిటీని లెక్కించే టప్పుడు ప్యానల్ నంబరు లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రక్రియ మండల డివిజిన్ స్థాయి వరకే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ మునాఫ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుప్పం కోర్టుకు హాజరైన టీడీపీ నేతలు



కుప్పం, ఆగస్టు 12: మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు సోమవారం కుప్పం జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబును కుప్పం పర్యటనలో అప్పటి వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది. దీనిని వ్యతిరేకించి నిలిచిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అప్పటి పోలీసులు 307 సెక్షన్ కింద కేసులు పెట్టారు. 30 రోజులపాటు ఎనిమిది మంది నాయకులను జైలులో పెట్టారు. ఈ కేసుకు సంబంధించి టీడీపీ నాయకులు సోమవారం కోర్టుకు హాజరయ్యారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పుంగనూరు రూరల్, ఆగస్టు12: విద్యార్థుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విజ్ఞానజ్యోతి పాఠశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో విద్యారంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు మెస్, స్కాలర్‌షిప్, ఫీజ్ రీయంబర్స్‌మెంటులను చెల్లించాలన్నారు. విద్యార్థి నేతలు మోహన్, సిద్దార్థ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలంటూ వినతులు

పుంగనూరు రూరల్, ఆగస్టు12: ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, వంకల ఆక్రమణలు తొలగించాలని పలు గ్రామాల రైతులు తహసీల్దార్ రాముకు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం భీమగానిపల్లె, చంద్రమాకులపల్లె గ్రామాల రైతులు ఈమేరకు ఫిర్యాదు చేశారు. రైతులు మాట్లాడుతూ భీమగానిపల్లె పరిధిలోని వంకలు, గుట్ట పోరంబోకు, చెరువును కొందరు ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నట్లు వివరించారు. చంద్రమాకులపల్లె పంచాయతీలోని రాయల చెరువు, తిప్పరాజు చెరువు, సుబ్బారెడ్డి చెరువులను రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులు ఆక్రమించారన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన

పెద్దపంజాణి, ఆగస్టు 12: అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీపీ రెడ్డెప్ప సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ గ్రామాణాభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక ఎమ్పీడీఓ కార్యాలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్పీడీఓ అబ్దుల్‌రహీం, ఈఓపిఆర్డీ శారదాదేవి, శిక్షణా నిపుణులు విజయదత్, శివయ్య సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి దాతల సహకారం

పుంగనూరు, ఆగస్టు12: స్థానిక గ్రంథాలయానికి అవసరమైన వస్తువులు కొనుగోలుకు సహకరించిన దాతలు శైలేంద్ర, పగడాల రమణ, గిరిధర్‌లను గ్రంథాలయ అధికారి తులసీనాథ్ సోమవారం సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతి, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన దళిత నేతలు



పుంగనూరు రూరల్, ఆగస్టు12: కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ రామును ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ, మాలమహానాడు నాయకులు సన్మానించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలసి దళితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, నాగరాజ, భాస్కర్, రమేశ్, రామయ్య ప్రసాద్, పాముల హరి పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి విశేషపూజలు



కల్లూరు, ఆగస్టు 12: దేవళంపేటలో కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అర్చకులు ఫణిప్రకాష్ శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

దివ్యాంగులకు భోజన వితరణ



పలమనేరు, ఆగస్టు12 : శ్రావణ సోమవారం సందర్భంగా స్థానిక మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నవీన్‌కుమార్ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. విశేషమైన రోజుల్లో ఆయన పేదలకు అన్నదానం చేస్తుంటారు. బోయకొండ ఆలయంలో నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణగా సమకూర్చుతుంటారు.

ఘనంగా పాలేటమ్మ వేడుకలు



సోమల, ఆగస్టు 12: నెల్లిమందలోని పాలేటమ్మ వారి ఆలయంలో ఆదివారం రాత్రి జాతరకు భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సోమల, ఎగువపల్లె, దిగువపల్లె, చిన్నసోమల తదితర గ్రామాల నుంచి చాందినీ బండ్లు మంగళ వాయిద్యాల, డీజే, కోలాటాల నడుమ ఊరేగింపుగా సోమవారం ఉదయం చేరుకున్నారు. పొంగళ్ళు, పిండిదీపాలు సమర్పించుకున్నారు. ఉదయం అమ్మవారికి బలిదానం చేసి బలిహరణను పంట పొలాల్లో చల్లారు. అన్నదాన బండ్లతో అన్నవితరణ చేశారు. ధర్మకర్త సాకిబండ నరసింహులు, ఎస్ఐ శివశంకర, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



గుడుపల్లె, ఆగస్టు 12: గుత్తార్లపల్లె ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాజేశ్వర్ కుమార్‌కు డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాదు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కల్చర్ సెంటర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మనం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కడపగండ్ల చక్రవర్తి నుంచి ఆయన డాక్టరేట్ పట్టా, సేవారత్న అవార్డును అందుకున్నారు. విద్యా ప్రమాణాల మెరుగుకు చేసిన విశేష కృషికి గాను ఈ గుర్తింపు ఆయనకు లభించింది.

తహసీల్దారు బాబుకు సత్కారం



రామకుప్పం, ఆగస్టు 12: మండల తహశీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బాబును సోమవారం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, కొళ్ళపల్లెబాబు, పెరుమాళ్, నియాజ్, అల్లీశిన, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా యువత

పుంగనూరు, ఆగస్టు 12: గ్రామీణ ప్రాంతాలల్లోని యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు తమ వంతు కృషి చేస్తామని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై వీరికి మూడు రోజుల పాటు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత చెడు మార్గాల్లో వెళ్లకుండా చూడాలని కోరారు.

ప్రజా అర్జీలకు పరిష్కారం చూపాలి

సోమల, ఆగస్టు 12: ప్రజా పరిష్కార వేదికలో సోమవారం ప్రజల నుంచి అందే ప్రతి అర్జీని పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు తహసీల్దార్ బెన్నిరాజ్‌ను కోరారు. రేషన్ షాపుల్లో సక్రమంగా నిత్యావసర సరుకులు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా బాధ్యతల చేపట్టిన బెన్నిరాజ్‌ను తహసీల్దార్‌ను సోమవారం పలువురు నాయకులు సన్మానించారు. మండలంలో నెలకొన్న పలు భూ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. సన్మానించిన వారిలో డాక్టర్ హరినారాయణ, రామకృష్ణ రాయల్, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

దేశమ్మగుడిలో అధ్వానంగా పారిశుధ్యం
- అధికారులపై మండిపడ్డ ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి, ఆగస్టు 12: అనునిత్యం భక్తులతో కిటకిటలాడే దేశమ్మ ఆలయంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో అధికారులపై ఎమ్మెల్యే భానుప్రకాష్ మండిపడ్డారు. ఆడిమాసం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు జరుగుతున్నా ఆలయ ఆవరణ పరిశుభ్రంగా ఉంచకపోవడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తొలగిస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, తహశీల్దార్ రవికుమార్, ఉత్సవకమిటీ సభ్యులు మురళిరెడ్డి, వీకేఎస్‌వాసు, వెంకటాచలపతి నాయుడు, నాయకులు బాలాజీ, నారాయణస్వామి నాయుడు, పూజారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు భార్యకు ఉద్యోగం



గీతకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

చిత్తూరు, ఆగస్టు 12: హోంగార్డు విభాగంలో హెడ్ గార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పట్టాభి భార్యకు కారుణ్య నియామకం కింద సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఉద్యోగావకాశాన్ని కల్పించారు. పట్టాభి ఈ ఏడాది ఫిబ్రవరి 10వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన భార్య గీతకు సి కేటగిరి కింద ఉద్యోగం కల్పిస్తూ పోలీసు కార్యాలయంలో ఉత్తర్వు కాపీని అందించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, హోంగార్డు ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

చిత్తూరు, ఆగస్టు 12: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం పది అర్జీలు అందగా, వాటిలో ఇంజనీరింగ్‌కు 03, టిడ్కోకు 02, టౌన్ ప్లానింగ్‌కు 02, పీహెచ్, రెవెన్యూ, మెప్మాకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయి. ఏసీపీ రామకృష్ణుడు, మేనేజర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వికసిత ఆంధ్రప్రదేశ్ సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యం
● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, ఆగస్టు 12: వికసిత ఆంధ్రప్రదేశ్ సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు ముందు చూపు రాష్ట్ర ప్రగతికి బాటలు వేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ సర్కార్ అన్ని సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రధాని మోదీ నుంచి కేంద్రమంత్రులందరూ రాష్ట్ర అభివృద్ధి విషయంలో కీలక భూమిక పోషించనున్నారన్నారు. రాష్ట్రం దేశంలోనే ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా మారనుందని తెలిపారు. రాజధాని అమరావతి ప్రపంచ దిగ్గజాలను ఆకర్షించడంలో గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. చంద్రబాబు సారధ్యంలో సాంకేతిక అభివృద్ధి కోసం వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పరచడం, నైపుణ్యాభివృద్ధిని అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన పాలనకోసం సాంకేతికతను ఉపయోగించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు సాగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ తెలిపారు. సోమవారం నగరంలోని తన నివాసంలో టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే పేరుతో జగన్ అన్నదమ్ములు, బంధువుల మధ్య గొడవలు సృష్టించాడని ఆరోపించారు. వాటిని సరిచేసేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా గ్రామాల్లోనే గ్రామసభలు నిర్వహించి, అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించనున్నారన్నారు. తహశీల్దార్ నుంచి వీఆర్వో వరకు ఏడుగురు అధికారులు గ్రామసభలకు హాజరై రికార్డులను పరిశీలించి, సమస్యలను తీరుస్తారని ఆయన పేర్కొన్నారు. దీనిపై గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు శశికర్‌బాబు, రఘు, మాజీ ఎంపీపీ రాజేంద్రన్, కుర్చివేడు సర్పంచ్ దిలీప్, నాయకులు గురేష్, వెంకటేష్, రాజేష్, శీనా పాల్గొన్నారు.

16 నుంచి గ్రామ సభలు

చిత్తూరు రూరల్ మండలంలోని 17 పంచాయతీల్లో 41 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఇందులో ఒక్కోరోజు ఒక్కో రెవెన్యూ గ్రామంలో సభలను నిర్వహించనున్నారు. ఈ నెల 16వ తేది నుంచి సెప్టెంబర్ 30 వరకు గ్రామసభలు జరుగుతాయి. అందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ కళావతి తెలిపారు. త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని ఆమె పేర్కొన్నారు.

25న 'తెలుగు వైభవం'



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 12: భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 25న తెలుగు వైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నారాయణస్వామి, దేవేంద్రరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వారు నగరంలోని సంస్థ కార్యాలయంలో కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జాతీయస్థాయి తెలుగు కవి సమ్మేళనం, తెలుగు రచయితల సమావేశం నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు.

సీబీఎస్ఈ పరీక్షల పరిశీలన

నగరి, ఆగస్టు 12: నగరి మున్సిపాలిటీలోని సత్రవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన సీబీఎస్ఈ పరీక్షలను ఎంఈఓ-2 నమశ్శివాయ పరిశీలించారు. ఈనెల 12నుంచి 17వ తేదీ వరకు ట్యాబ్‌లద్వారా జరిగే ఈ పరీక్షలను 10వ తరగతి విద్యార్థులు 120 మంది రాస్తున్నట్లు పేర్కొన్నారు. సీఆర్ఎంటీ అయ్యప్ప, ప్రధానోపాధ్యాయులు సరోజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ధర్మరాజుల పట్టాభిషేకం



నగరి, ఆగస్టు 12: నగరి మున్సిపాలిటీలోని చింతలపట్టెడలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న ధర్మరాజు తిరునాళ్లలో భాగంగా సోమవారం ధర్మరాజుల పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నటరాజన్ భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేయించారు.

తహసీల్దార్‌ను సత్కరించిన టీడీపీ నాయకులు



విజయపురం, ఆగస్టు 12: తహసీల్దార్ కిరణ్‌ను సోమవారం మండల టీడీపీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు లోకేష్‌రాజు, కొండూరు ధాము, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషిచేద్దాం: కలెక్టర్



వైద్యఆరోగ్యశాఖ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషిచేద్దామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో వైద్యాధికారులతో కలసి పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో 'మీకు తెలుసా' పేరిట రెండునెలల పాటు ప్రత్యేకఅవగాహన కార్యక్రమాలు సోమవారంనుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గర్భిణీకి తొలి మూడు నెలల్లోనే హెచ్ఐవీ పరీక్షలు జరపాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో ప్రభావతి, అడిషినల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు

వెదురుకుప్పం, ఆగస్టు 12: జీవితంపై విరక్తి చెందిన ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కార్వేటినగరం మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు... కార్వేటినగరం మండలం చాకలివాని గుంట ఎస్టీ కాలనీకి చెందిన వరలక్ష్మి(37)కి పదేళ్ల క్రితం భర్త పాల్ చనిపోయాడు. వీరి కుమారుడు శ్యామ్(18) ఐదేళ్ల క్రితం ఇల్లు వదిలిపోయాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న వరలక్ష్మి ఈ నెల ఆరవ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి కాలనీ సమీపంలోని ఓ మామిడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువులు వెతికినా ప్రయోజనం లేకపోయింది. కాలనీ సమీపంలోని ఓ మామిడి తోటలో వేలాడుతూ కుళ్లిపోయిన శవమై కనిపించింది. దీంతో మృతురాలి అన్న పి.మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీసులు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శవం కుళ్లిపోయి ఉండటంతో ఘటన ప్రాంతంలోనే శవపరీక్ష నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు.

ఎంపీడీవోగా రమణప్రకాష్

విజయపురం, ఆగస్టు 12: విజయపురం ఎంపీడీవోగా ఎం.వీ.రమణప్రకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏవోగా పని చేస్తూ అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మయ్య బదిలీపై నెల్లూరుకు వెళ్లారు.

చిత్తూరు రైల్వే సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు రూరల్, ఆగస్టు 12: చిత్తూరు రైల్వే సమస్యలను పరిష్కరిచాలని కోరుతూ సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ శ్రీనివాస మల్లాడికి సీఎస్ సీడీఎస్ ప్రతినిధులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కాట్పాడి వయా చిత్తూరు, పాకాల, తిరుపతికి డబుల్ లైన్ నిర్మించాలని కోరామన్నారు. ప్రతినిధులు సత్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి ఉండాలి

బంగారుపాళ్యం, ఆగస్టు 12: ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తి ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆ ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు మొగిలయ్య, జిల్లా కార్యదర్శి సరిత, నేతలు మోహన్‌రెడ్డి, మహేష్‌బాబు, బాలాజి, కృష్ణమూర్తి, మురళి, పొన్నని పాల్గొన్నారు.

స్కావెంజర్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పెనుమూరు, ఆగస్టు 12: మండలంలో మాన్యువల్ స్కావెంజర్స్ ఇన్ శానిటరీ వర్కర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారంలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ప్రభుత్వం సబ్సిడీ లోన్లు మంజూరు చేస్తుందని, చేసుకోనివారికి ఎటువంటి సహాయ సహకారాలు అందవని ఆయన అన్నారు.

అమ్మపేరుపై మొక్కనాటాలి: బీజేపీ

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 12: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ అమ్మపేరుపై మొక్క నాటాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ పిలుపు నిచ్చారు. సోమవారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో రాయలసీమ జోనల్ ఎస్సీ మోర్చా సమావేశం జరిగింది. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ బాబు, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 12: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వ్యాధి నిరోధక టీకా అధికారి హనుమంతరావు, ఎన్సీడీ కోఆర్డినేటర్ శిరీషలు చెప్పారు. నాషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పొగాకు, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జీవన జ్యోతి అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మాదక ద్రవ్యాలు, పొగాకు, బీడీ, సిగరెట్, గుట్కా లాంటి వాటి బారిన పడకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై జిల్లా సైకియాట్రిస్టు డాక్టర్ ఉదయ్‌కిరణ్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోటల పెంపకంపై శిక్షణ

వెదురుకుప్పం, ఆగస్టు 12: పోషకాహారం తోటల పెంపకంపై సోమవారం రాస్ శాస్త్రవేత్త శ్రీలత కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట కాలనీలో శిక్షణ ఇచ్చారు. పోషకాహారం తోటల పెంపకం, పోషక విలువలపై అవగాహన కల్పించారు.

ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయండి

పాలసముద్రం, ఆగస్టు 12: మండలంలోని 13 పంచాయతీల్లో వివిధ దశల్లో నిర్మాణ పనులు ఆపేసిన ఇండ్ల లబ్ధిదారులు వెంటనే వాటిని పూర్తి చేయాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి వందరోజుల్లోగా ఇండ్ల నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలని ఆదేశించారు. హౌసింగ్ ఏఈ దాము, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా వెళ్లాలి..!



గుడిపాలలో బ్రిడ్జి కింద చేరిన నీరు

గుడిపాల, ఆగస్టు 12: హైవే రోడ్డు నిర్మాణపు పనుల్లో భాగంగా బ్రిడ్జి పనులు చేయడంతో నీళ్లంతా కింద ఉండిపోవడంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బ్రిడ్జిల వద్ద నీరు ఎటూ వెళ్లక నిలిచిపోవడంతో ఇటు విద్యార్థులు, అటు రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చలిచీమల పల్లె, సింగారపేట గ్రామాలకు ఎలా వెళ్లాలని హైవే అధికారులను ప్రశ్నించారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.



నగరి రైల్వేస్టేషన్ సమీపంలోని అండర్‌బ్రిడ్జి వద్ద నిలిచిన వర్షం నీరు

అండర్‌బ్రిడ్జి కింద నిలిచిన వర్షం నీరు
- వాహనదారులకు తప్పని తిప్పలు

నగరి, ఆగస్టు 12: నగరి రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన అండర్‌బ్రిడ్జ్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎక్కువ మోతాదులో నీరు నిలిచి పోవడంతో వాహనచోదకులు తిప్పలుపడ్డారు. అండర్‌బ్రిడ్జిలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసి గుత్తేదారుడికి రెండు విద్యుత్ మోటార్లను ఇచ్చారు. ఆ మోటార్లు మరమ్మతులకు గురికావడంతో డీజిల్ యంత్రాలను వాడటానికి వెనుకంజ వేయడంతో ముడిపల్లి, మేలపట్టు, రామాపురం, ఏడుగట్లు గ్రామవాసులతో బాటు ఆ మార్గంలో వచ్చే వాహన చోదకులు నానా తిప్పలు పడుతున్నారు. ఆదివారం రాత్రి బ్రిడ్జికింద వచ్చిన వాహనాలు పాడైపోవడంతో వాహన చోదకులు అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తోంది.

నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 12: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలని కోరారు. అనంతరం భారీ జాతీయ పతాకాన్ని ఉన్నత పాఠశాల నుంచి పూతలపట్టు పురవీధుల్లో ఊరేగిస్తూ చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తులసి, మండల అధ్యక్షుడు నరసింహులు నాయుడు, ఐరాల, తవణంపల్లి, యాదమరి, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు కుమార్, పయని, రవి, రాజేష్, టీడీపీ నాయకులు గంగారపు గోపి, శేషాద్రి నాయుడు, గుంటూరు మురళి, హరి, అర్జున్, మంజునాథ్, జయప్రకాష్, మునిరాజులు, దాము, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



గంగాధరనెల్లూరు, ఆగస్టు 12: మండల కేంద్రంలోని గంగాధరనెల్లూరు అబ్బాస్‌కాలనీవద్ద షియా ముస్లింలు పీర్లను ఊరేగించి, పలువురు అజాదారి మాతం (రక్తతర్పణం) నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మొహరంలో భాగంగా గంగాధరనెల్లూరు పంచాయతీ అబ్బాస్‌కాలనీ వద్ద సోమవారం షహజతే బీబీ షకీనా జ్ఞాపకార్థం షియా ముస్లింలకు చెందిన చిన్నారులు, యువకులు, మహిళలు, పెద్దలు నల్లదుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అబ్బాస్‌కాలనీ మసీదు నుంచి పీర్లను ఊరేగించారు. తర్వాత గంగాధరనెల్లూరు - తూగుండ్రం రహదారిపై చిన్నారులు, యువకులు, పెద్దలు పదునైన చాకులు, బ్లేడ్లతో ఎదపై, వీపుపై కొట్టుకుంటూ అజాదారి మాతం (రక్తతర్పణం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్‌కాలనీ వాసులు, మండలంలోని వారితో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని షియా ముస్లింలు హాజరై రక్తం చిందించి మొక్కులు తీర్చుకున్నారు.

అక్టోబరు 2లోగా విండోల్లో డిజిటలైజేషన్ పూర్తిచేయండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12: గాంధీ జయంతిలోగా అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (సింగిల్ విండోలు)లో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి జేసీ శ్రీనివాసులుతో కలిసి ఎంపీడీవోలు, సహకారశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి ఈకేవైసీ నమోదు ప్రక్రియ రెండ్రోజుల్లోగా పూర్తిచేయాలని, ప్రాథమిక సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అతి తక్కువ వివరాలతో సభ్యత్వం తీసుకున్నారన్నారు. గ్రామాల వారీగా సభ్యుల వివరాలను విండోల సీఈవోలు సేకరించి ఎంపీడీవోలకు అందించాలన్నారు. సభ్యుల కేవైసీ వివరాలు, మొబైల్, ఆధార్ నెంబరు, భూహక్కు వివరాలు తయారుచేయాలని ఎంపీడీవోలకు సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డీసీవో నాగవర్ధని, డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పని సర్దుబాటును బహిష్కరిస్తాం: ఫ్యాప్టో



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న టీచర్లు

నగరి, ఆగస్టు 12: ఉపాధ్యాయుల పని సర్దుబాటు కార్యక్రమాన్ని టీచర్లందరూ మూకుమ్మడిగా బహిష్కరిస్తామని ఫ్యాప్టో నాయకులు ఎంఈవో శ్రీదేవికి వినతిపత్రం అందించారు. జీవో నెంబరు 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన 53 జీవో ప్రకారం సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. 2025 ఏప్రిల్ 30 లోపు పదవీ విరమణ చేసే ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని తదితర 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నగరి మండల వనరుల కేంద్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎంఈవోకు అందించారు.

యాదమరి: అసంబద్ధమైన టీచర్ల సర్దుబాటును బహిష్కరిస్తున్నామని మండల ఫ్యాప్టో సంఘనేతలు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఎంఈవోలు రుక్మిణమ్మ, ప్రసాద్‌లకు వినతిపత్రాన్ని అందించారు. సర్దుబాటు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంఘ నేతలు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ లేకుండా సేవలందిద్దాం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, ఆగస్టు 12: రెవెన్యూలో దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు సేవలందిద్దామని వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్ బాబు చెప్పారని టీడీపీ శ్రేణులు తెలిపారు. సోమవారం వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్‌బాబును టీడీపీ నాయకులు కలసి శాలువ కప్పి సత్కరించారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి నేసనూరు మునిచంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, పోటుగారి గంగయ్య, బండి విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఉన్నారు. అదేవిధంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సంఘ నాయకులు తహసీల్దార్‌ను కలిసి సన్మానించారు. కేశవులు, జి.తోయజాక్షిరెడ్డి, బి.విజయశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నైబర్‌హుడ్ సర్వేలో ఎస్‌హెచ్‌జీలు భాగస్వాములు కావాలి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 12: స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) జీవనోపాధి పెంపు కోసం చేపట్టే నైబర్‌హుడ్ బిజినెస్ సర్వేలో ప్రతి ఒక్క సంఘ సభ్యురాలు భాగస్వాములు కావాలని డీఆర్‌డీఏ పీడీ తులసి పిలుపునిచ్చారు. సోమవారం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మహిళా సభ్యులతో మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌జీ సభ్యులు, వారి పిల్లలు చదువుకుని ఉపాధి అవకాశాలు లేక జీవనం గడుపుతున్న వారికి ఇంటి వద్దనే ఎంచుకున్న వృత్తిలో ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. టైలరింగ్, కాల్ సెంటర్లలో, వ్యవసాయ, వ్యవసాయేతర, కుటీర పరిశ్రమలు, ఫుడ్‌సెక్టార్ వంటి చేతివృత్తుల్లో మెరుగైన శిక్షణ ఇచ్చి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఎమ్మెల్యేచే విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 12: గంగాధరనెల్లూరు హైస్కూల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ చేతుల మీదుగా ప్రభుత్వం తరఫున సరఫరా చేసిన పుస్తకాలను మంగళవారం పంపిణీ చేయనున్నట్లు మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు స్వామిదాస్, జ్యోతిరెడ్డి, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం తెలిపారు.

కమనీయంగా పచ్చయమ్మన్ కల్యాణోత్సవం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 12: నగరంలోని 75 దొడిపల్లెలో వెలసిన మన్నారుస్వామి పచ్చయమ్మన్ కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ఆలయ నిర్వాహకులు ఆర్.ఎస్.తిరుకురన్ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు అన్నదానం చేశారు.

దారి సౌకర్యం కల్పించాలి

గుడిపాల, ఆగస్టు 12: మండలంలోని తమిళనాడు సరిహద్దులో ఉన్న చలిచీమలపల్లె గ్రామస్తులు సోమవారం ఇటు తమిళనాడుకు అటు ఆంధ్రాకు దారి సౌకర్యాన్ని కల్పించాలని నిరసన తెలిపారు. నేషనల్ హైవే నిర్మాణానికి భూములు తీసుకుని దారి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. దారి సౌకర్యం కల్పిస్తేనే పనులు చేయాలని హైవే అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామి ఇవ్వడంతో గ్రామస్తులు నిరసనను విరమించారు.

గంజాయిని అరికట్టండి: టీడీపీ



సీఐతో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, ఆగస్టు 12: మండలంలో గంజాయి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడును టీడీపీ నేతలు కోరారు. సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు సీఐని కలిసి సన్మానించారు. టీడీపీ నేతలు హరిప్రసాద్, శంకర్ చౌదరి, శివలింగారెడ్డి, నిత్యానందయాదవ్, రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు దృష్టిలోపం ఉండకూడదు

యాదమరి, ఆగస్టు 12: విద్యార్థులకు దృష్టిలోపం ఉంటే ఆ ప్రభావం చదువుపై పడుతోందని, కంటి సమస్య ఉన్నవారు వెంటనే ఉపాధ్యాయులు లేదా వైద్యుల్ని సంప్రదించాలని సీహెచ్‌వో లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం యాదమరి ఉన్నత పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమం కింద పలువురి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. హెచ్ఎం గిరిరాజ, అప్తాలిక్ అసిస్టెంట్ మధు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పంటలకు యూరియా అధికమైతే అవస్థలే

పాలసముద్రం, ఆగస్టు 12: వరి పంటకు యూరియా అధికంగా వాడితే చీడపీడలు ఎక్కువై రైతులకు నష్టం చేస్తుందని ఏవో డిల్లీ ప్రసాద్ సూచించారు. సోమవారం తిరుమలరాజుపురం, నరసింహాపురం పంచాయతీల్లో వరిసాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

వెదురుకుప్పం, ఆగస్టు 12: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ గ్రామ కార్యదర్శులకు రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, స్ట్రీట్ లైటింగ్ అంశాలపై రిసోర్సు పర్సన్లు శిక్షణ ఇచ్చారు.

నింద్ర: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్, కార్యదర్శులే కీలకమని ఎంపీడీవో భవానీ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏవో వేణు, ఈవోపీఆర్‌డీ వెంకటేశులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, వెదురుకుప్పం ఈవోపీఆర్‌డీ పురుషోత్తం, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుడిపాల: తమ హక్కులను సర్పంచ్‌లు తెలుసుకుని పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఇన్‌ఛార్జీ ఎంపీడీవో ఉపేంద్ర, కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నివారణ, గ్రామ పంచాయతీల పాత్రవంటి అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పంచాయతీ నిధులు, విధులపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఎంపీడీవో శివశంకర్ చెప్పారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ రాజ్ కార్యాచరణ ప్రణాళికపై 2024-25 సంవత్సరాల వార్షిక శిక్షణా తరగతులు నిర్వహించామని తెలిపారు. శిక్షణా తరగతులు ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఐరాల ఎంపీడీవోగా నాగరాజు

ఐరాల, ఆగస్టు 12: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఐరాల మండలం నుంచి బదిలీపై వెళ్లిన ఎంపీడీవో నాగరాజు తిరిగి అదే స్థానానికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన వెంకటేష్ వైఎస్ఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 12: డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి శ్రావణ సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. అలాగే ఎగువ కన్నికాపురం సమీపంలో ఉన్న స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో, చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర ఆలయాల్లో రుద్రాభిషేకం తదితర పూజలు జరిపించారు.

17 నుంచి వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 12: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. మొదటి రోజున 17వ తేదీన సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి, 18, 19వ తేదీల్లో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు తెప్పలపై విహరిస్తారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తారు.